నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
EVENING EDITION
పేజీలు: 02
PM
www.suryaa.com








ఎలక్షన్ వార్

## మత్తెక్కించే అందాలతో మైమరిపిస్తున్న దిశా పటాని

హాట్ బ్యూటీ దిశా పటాని. హాట్ హాట్‌గా ఫోజులిస్తూ ఫోటో షూట్‌లో రెచ్చిపోతుంది. అందాలన్నీ వడ్డించేస్తూ చిత్తు చేస్తుంది. తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన పిక్స్ వైరల్ అవుతున్నాయి.ముద్దుగుమ్మ అందాలకు ఫిదా అవుతూ నెటిజన్లు వరుసగా కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. బాలీవుడ్ లో మాత్రం టైగర్ ష్రాఫ్ నుండి సల్మాన్ లాంటి సీనియర్ హీరోల వరకు అందరితో సినిమాలు చేస్తూ నిలదొక్కుకునే ప్రయత్నాలు చేస్తుంది. దిశా సినిమాలతో పాటు మరో చేత్తో సోషల్ మీడియాలో సూపర్ యాక్టివ్ గర్ల్ అనిపించుకుంది. మెగా హీరో వరుణ్ తేజ్ లోఫర్ సినిమాతో టాలీవుడ్ ప్రేక్షకులకు దగ్గరైన బ్యూటీ దిశా. ఆ చిత్రంలో దిశా అందాల ఆరబోతకు అందరూ ఫిదా అయ్యారు. కానీ ఆ తరువాత దిశా పటాని మరో తెలుగు ప్రాజెక్ట్‌లో కనిపించలేదు.



## ఆస్ట్రేలియా అహంకారం.. వరల్డ్ కప్‌ను ఇలాగేనా గౌరవించేది?

ప్రతిష్టాత్మక ఫైనల్లో ఓటమితో టీమిండియా ఆటగాళ్లు కన్నీటి పర్యంతమయ్యారు. కోహ్లీ, రోహిత్, సిరాజ్ ఉబికివస్తున్న కన్నీళ్లను ఆపుకోలేకపోయారు. ఒకవైపు భారత క్రికెటర్లు ఏడస్తుంటే.. మరోవైపు ఆసీస్ క్రికెటర్లు సెలబ్రేషన్స్‌లో మునిగిపోయారు. అయితే కప్పు నెగ్గిన తర్వాత ఆ జట్టు ప్లేయర్లు ప్రవర్తించిన తీరు వివాదాస్పదంగా మారింది. క్రికెట్‌లో ఎంతో గొప్పగా భావించే వరల్డ్ కప్‌పై ఆసీస్ ఆల్‌రౌండర్ మిచెల్ మార్ష్ తన రెండు కాళ్లు పెట్టి పోజు ఇచ్చాడు. కప్పుపై మార్ష్ కాళ్లు పెట్టిన ఫొటో వైరల్ అవుతుండటంతో నెటిజన్స్ సీరియస్ అవుతున్నారు. ఆస్ట్రేలియా అహంకారానికి ఇది నిదర్శనమని.. కప్పును గౌరవించే పద్ధతి ఇదేనా అని ఫైర్ అవుతున్నారు.





## హార్బర్ చరిత్రలోనే ఘోర ప్రమాదం..

### విశాఖ ఘటనపై సీఎం జగన్ దిగ్భ్రాంతి.. విచారణకు ఆదేశం..

విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో భారీ అగ్ని ప్రమాదం తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. లక్షల విలువ చేసే మత్స్య సంపద, బోట్లు అగ్నికి ఆహుతయ్యాయి. లక్షల విలువ చేసే మత్స్య సంపద బోట్లలోనే ఉంది. ఈ ఉదయం వాటిని వేలం వేసి విక్రయించాల్సి ఉంది. అంతలోనే ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదానికి గురైన ఒక్కో బోటులో 5 నుంచి 6 లక్షల విలువైన చేపలున్నాయని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రమాదంలో దాదాపు 40 బోట్లు కాలి బూడిద కాగా.. మరో 40 బోట్లు ధ్వంసమయ్యాయి. రూ.30కోట్లకు పైగా ఆస్తినష్టం కాగా.. 3వేల కుటుంబాలు రోడ్డునపడ్డాయి. ఇంకా భారీగా ఆస్తినష్టం జరిగి ఉండవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం ఫిషింగ్ హార్బర్ లో మంటలు దాదాపుగా అదుపులోకి వచ్చాయని పోలీసులు తెలిపారు. చివరి బోటు మంటలను ఆర్పేందుకు ఫైర్ సిబ్బంది తీవ్రంగా శ్రమించారు. బోట్లలో డీజిల్ నిండి ఉండడంతో దట్టంగా పొగ వ్యాపించింది. మంటలు చెలరేగి 40కి పైగా మరబోట్లు దగ్ధమయ్యాయని.. పోలీసులు తెలిపారు. రాత్రి 10:30 గంటలకు మంటలు చెలరేగాయని.. గాలుల తీవ్రతతో పక్క బోట్లకు వ్యాపించాయని తెలిపారు. బోట్లలో సిలిండర్లు, డీజిల్ ఉండడంతో మంటల తీవ్రత పెరిగిందని.. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని డీసీపీ ఆనందరెడ్డి తెలిపారు. కొన్ని బోట్లు దగ్ధమయ్యాయి, మరికొన్ని తరలించాం, ప్రమాదానికి కారణం తెలియాల్సి ఉందని డీసీపీ ఆనందరెడ్డి వివరించారు. ఈ ప్రమాదంపై పూర్తిస్థాయి విచారణ జరుపుతున్నామని విశాఖ సీపీ రవిశంకర్ తెలిపారు. ప్రమాదం తర్వాత యువకులు పరారయ్యారని.. వారికోసం గాలిస్తున్నామని తెలిపారు.

కాగా.. విశాఖ హార్బర్ ప్రమాదంపై సీఎం జగన్ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. మత్స్యకారుల బోట్ల దగ్ధంపై సీఎం జగన్ దర్యాప్తునకు ఆదేశించారు. ఘటనాస్థలానికి వెళ్లి వివరాలు సేకరించాలని మంత్రి సీదిరికి సీఎం సూచించారు. బోట్లు కోల్పోయిన మత్స్యకారులకు అండగా ఉండాలని.. ప్రమాదం వెనుక ఎవరున్నా వదిలిపెట్టవద్దంటూ జగన్ అధికారులకు స్పష్టంచేశారు.

**హార్బర్ చరిత్రలో..**

కాగా.. హార్బర్ చరిత్రలో ఇంత పెద్ద ప్రమాదం ఎప్పుడూ జరగలేదని స్థానికులు తెలిపారు. లంగర్ వేసిన బోటులో పార్టీ జరిగిందని.. అక్కడ గొడవ జరిగడంతోనే మంటలు చెలరేగాయని పేర్కొంటున్నారు. హార్బర్‌లో ఈ ప్రమాదానికి అసాంఘిక శక్తులు కారణమై ఉండొచ్చని ఏపీ మెకనైజ్డ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జానకిరామ్ పేర్కొన్నారు. 40 బోట్లు కాలిపోయాయని.. మరో 40 బోట్లు దెబ్బతిన్నాయన్నారు. ఒక్కరి వల్ల ఇంతమంది తీవ్రంగా నష్టపోయారని.. జానకిరామ్ ఆవేదన వ్యక్తంచేశారు. గతంలో ఎన్నడూ విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో ఇంత పెద్దయెత్తున అగ్ని ప్రమాదం జరగలేదు. బోటు కింది భాగంలో మత్స్యకారులు వలలు, డీజిల్, వంట చేసుకునే గ్యాస్, ఇతర పరికరాలు ఉంటాయి. చిన్న అగ్ని ప్రమాదం జరిగినా.. మంటలు ఉవ్వెత్తున ఎగిసిపడతాయన్నారు.

**కారణం ఎవరు..?**

అయితే, ఈ ఘోర ప్రమాదానికి భిన్నమైన వాదనలు తెరపైకి వస్తున్నాయి.. బోటు అమ్మే విషయంలో గొడవ జరిగిందని కొందరు పేర్కొంటుండగా.. అది కాదని.. గొడవ జరిగిన బోటులో యూట్యూబర్ లోకల్ బాయ్ నాని ఉన్నట్లు మరికొందరు పేర్కొంటున్నారు. దీంతో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు.

**చర్యలు తప్పవు..**


అటు అగ్నిప్రమాదంలో నష్టపోయిన మత్స్యకార బాధితులను అన్ని విధాల ఆదుకుంటామన్నారు స్థానిక ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్. అగ్నిప్రమాద ఘటనా స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ ప్రమాదంలో కుట్రకోణం ఉంటే.. వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు ఎమ్మెల్యే..

## కాంగ్రెస్ మాటలు నమ్మి మోసపోవద్దు




కాంగ్రెస్ మాటలు నమ్మి మోసపోవద్దని, బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని ఎమ్మెల్సీ కవిత ప్రజలను కోరారు. 'తెలంగాణ రాకముందు రాష్ట్రం ఎట్లుండే.. ఇప్పుడెట్ల ఉన్నదో'గమనించాలని సూచించా రు. ధర్మపురి బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు మద్దతుగా ఆదివారం ఆమె ధర్మపురి, పెగడపల్లి మండలాల్లో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మూడు గంటల కరెంటు చాలని, ధరణిని తీసేస్తామని కాంగ్రెస్ నాయకులు అంటున్నారని, అదే జరిగితే రైతులకు అన్యాయం జరుగుతుందన్నారు. తాము మరోసారి అధికారంలోకొస్తే అన్నపూర్ణ పథకం కింద సన్నబియ్యం ఇస్తామన్నారు. ప్రస్తుత పథకాలు కొనసాగాలన్నా.. మరిన్ని పథకాలు రావాలన్నా సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమన్నారు. అనంతరం ఆమె ధర్మపురి శ్రీలక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజ లు చేశారు. తర్వాత స్థానిక బ్రాహ్మణ సంఘం భవనంలో మహిళలతో మాట్లాడారు.

## వేలంలో రికార్డు ధరకు నెపోలియన్ టోపీ



నెపోలియన్ చక్రవర్తి నెపోలియన్ బోనపార్టే ధరించిన టోపీ వేలంలో కొత్త రికార్డు సృష్టించింది. పారిస్‌లో నిర్వహించిన వేలంలో 1.932 మిలియన్ యూరోలకు అమ్ముడైంది. భారత కరెన్సీలో రూ.17 కోట్లు. 2014లో ఇదే నెపోలియన్ టోపీ 1.884 మిలియన్ యూరోలకు అమ్ముడైంది. ఇప్పుడు ఈ రికార్డును అధిగమించింది. ఈ నెపోలియన్ టోపీని బైకార్న్ అని పిలుస్తారు.

ELECTION SPECIAL 2023



## కాంగ్రెసోళ్లకు ఏం జరుగుతుందో తెలియడం లేదు

### మంత్రి హరీశ్ రావు


'పాపం కాంగ్రెసోళ్లకు కనీసం రాష్ట్రంలో ఏం జరుగుతుందో కూడా తెలియడం లేదు. మేము గెలిస్తే ఆరోగ్య శ్రీ కింద మోకాళ్ల చిప్పల ఆపరేషన్లు చేయిస్తామని మేనిఫెస్టోలో పెట్టింది. కానీ ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం వేయి మందికి ఆపరేషన్లు చేయించిందన్న సంగతి తెలియదని' ఎద్దేవా చేశారు. సిద్దిపేట, దుబ్బాక, సిరిసిల్ల, వేములవాడ, గజ్వేల్ సర్కారు హాస్పిటల్‌లో పైసా ఖర్చు లేకుండా మోకాలు చిప్పల ఆపరేషన్లు చేస్తున్నారన్నారు. ఆదివారం సిద్దిపేటలో తెలంగాణ రాష్ట్ర గురుకుల పేరెంట్స్ అసోసియేషన్ బీఆర్‌ఎస్ కు మద్దతుగా నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఒకప్పుడు నేను రాను బిడ్డో సర్కారు దవాఖాన అంటే నేడు పోదాం పద బిడ్డ సర్కారు దవాఖాన అంటున్నారన్నారు.290 ఉన్న గురుకులాల సంఖ్యను 1000 కి పెంచి ఆరు లక్షల మంది విద్యార్థులకు విద్యను అందిస్తున్నట్టు తెలిపారు. పేద విద్యార్థులను 20 లక్షలు ఇచ్చి విదేశాలకు పంపుతున్నది తెలంగాణ ప్రభుత్వమేనన్నారు. పేద పిల్లలు చదివే గురుకులాల్లో సన్నబియ్యం భోజనం పెడుతున్నామన్నారు. చెప్పుడు మాటలు వినకుండా కంటికి కనిపించే అభివృద్ధిని చూసి మద్దతివ్వాలని కోరారు. ఈ సందర్భంగా ప్రముఖ సింగర్ రాహుల్ సిప్లిగంజ్ రూపొందించిన పాటను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా 21 సంఘాల ప్రతినిధులు మంత్రి హరీశ్‌రావుకు మద్దతునిస్తున్నట్టు ఏకగ్రీవ తీర్మానాల కాపీలను అందజేశారు.



## మాదిగలను చిన్నచూపు చూస్తున్నరు

### ఎమ్మెల్యే రఘునందన్‌రావు

రాష్ట్రంలో 23 శాతం ఉన్న ఎస్సీలకు కేసీఆర్ మంత్రి వర్గంలో చోటు లేదని, మాదిగ ప్రజాప్రతినిధులను చిన్న చూపు చూస్తున్నారని ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఆరోపించారు. ఆదివారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం రుద్రారం, చౌదర్‌పల్లి, ఎనగుర్తి, బొప్పాపూర్, రాయపోల్ మండలం టెంకంపేట, బేగంపేట, ఎల్కల్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాయ మాటలతో ఎన్నికల ప్రచారానికి వస్తున్న బీఆర్‌ఎస్ నాయకులను నిలదీయాలన్నారు. జనాభాలో ఎస్సీలు 23 శాతం ఉంటే మంత్రి వర్గంలో ఒక్కరికే అవకాశం ఇచ్చారని, ఒక్క శాతం ఉన్న సీఎం కులానికి మాత్రం 5 మంత్రి పదవులు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. డబుల్‌బెడ్రూమ్‌లు, దళిత, బీసీ, మైనార్టీ బంధులను బీఆర్‌ఎస్ కార్యకర్తలకే పంపిణీ చేసుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వానికి వైన్స్‌టెండర్లపై ఉన్న చిత్తశుద్ధి ఉద్యోగ నోటిఫికేషన్లపై లేదని విమర్శించారు. పదేండ్లుగా కొత్త రేషన్ కార్డులను జారీ చేయలేదని, వీటి గురించి అసెంబ్లీలో మాట్లాడితే కేసీఆర్ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. తాను గెలిచిన తర్వాత దుబ్బాకలో డబుల్ బెడ్రూమ్‌లను పంపిణీ చేసి నూతన బస్టాండ్‌ఆధునాతన పద్దతుల్లో నిర్మించానన్నారు.



## అభివృద్ధి కొనసాగాలంటే బీఆర్‌ఎస్సే గెలవాలి

### మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి

గ్రామాల్లో అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ బీఆర్‌ఎస్సే అధికారంలోకి రావాలని మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య చెప్పారు. భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాయమాటలు చెబుతూ ప్రజలను మోసం చేస్తున్న బీజేపీ, కాంగ్రెస్ లీడర్ల మాటలు నమ్మొద్దని చెప్పారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా తెలంగాణలో అధికారం బీఆర్‌ఎస్‌దేనని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ గెలిస్తే కరెంట్ కష్టాలు తప్పవని, బీజేపీకి ఓటు వేస్తే మోటార్లకు మీటర్లు ఖాయమన్నారు. కార్యక్రమంలో చిట్యాల మార్కెట్ చైర్మన్ కొడారి రమేశ్, జడ్పీటీసీ సదయ్య, ఎంపీపీ సుజాత సంజీవరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తిరుపతిరావు, సొసైటీ చైర్మన్ నర్సింగరావు పాల్గొన్నారు.

సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM

# హాటుగా అదరగొట్టిన పంజాబీ అందం..

మెహ్రీన్ కౌర్ గురించి తెలుగు వారికి ప్రత్యేక పరిచయం అక్కర లేదు. అందం, అభినయం ఉన్నా... లక్ మాత్రం ఈ భామకు కలిసి రావడం లేదు. ఆమెకు ఆశించన రీతిలో బడా హీరోల సినిమాల్లో ఛాన్సులు రావడం లేదు. ఆ మధ్య వెంకటేష్, వరుణ్ తేజ్ హీరోలుగా నటించిన 'F3' సినిమా సక్సెస్ అయినా.. అందులో ఈ భామకు పెద్దగా ఒరిగిందేమి లేదనే చెప్పాలి. అది అలా ఉంటే ఈ భామ తాజాగా కొన్ని ఫోటోలను పంచుకుంది. ప్రస్తుతం అవి వైరల్ అవుతున్నాయి.అది అలా ఉంటే మెహ్రీన్‌కు సినిమాల్లో అవకాశాలు తగ్గడంతో తాజాగా ఓ వెబ్ సిరీస్‌లో నటించింది. హాట్ స్టార్ కోసం 'సుల్తాన్ ఆఫ్ ఢిల్లీ' వెబ్ సిరీస్‌లో మెహ్రీన్ నటించింది. అయితే ఈ వెబ్ సిరీస్‌లో ఆమె చాలా బోల్డ్ గా నటించిందన్న విమర్శలు వచ్చాయి. అయితే ఆ విమర్శలపై.. బోల్డ్ సీన్స్‌పై క్లారిటీ కూడా ఇచ్చింది. ఆమె ఆ సీన్స్ గురించి మాట్లాడుతూ.. అది మ్యారిటల్ రేప్ అని.. భార్యకు ఇష్టం లేకున్నా భర్త ఫోర్స్ చేయడం మ్యారిటల్ రేప్ గా పేర్కొంటారని వివరణ ఇచ్చింది. అయితే కొన్ని మీడియా వర్గాలు మాత్రం దాన్ని సెక్స్ సీన్లుగా అభివర్ణించడం చూసి బాధపడ్డానని పేర్కొంది.






## 'ఫ్రీ పాలస్తీనా' టీ-షర్ట్‌తో మ్యాచ్‌లో వ్యక్తి హల్‌చల్

అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో ఇండియా, ఆస్ట్రేలియా ప్రపంచ కప్ ఫైనల్స్‌లో ఓ ఆసక్తికరమైన పరిణామం చోటుచేసుకుంది. పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడికి నిరసనగా 'ఫ్రీ పాలస్తీనా' టీ-షర్ట్ ధరించిన ఓ వ్యక్తి మ్యాచ్ జరుగుతున్న సమయంలో పిచ్‌లోకి వచ్చి హల్ చల్ చేశాడు. అంతేకాదు, కోహ్లీని కౌగిలించుకునే ప్రయత్నం కూడా చేశాడు. ఎర్రటి షార్ట్ ధరించిన ఆ వ్యక్తి, ముందు భాగంలో 'పాలస్తీనాపై బాంబింగ్ ఆపండి', టీ షర్ట్ వెనుక 'ఫ్రీ పాలస్తీనా' అనే సందేశంతో తెల్లటి టీ షర్టు ధరించాడు. పాలస్తీనా రంగులలో ముఖానికి మాస్క్‌ను కూడా అతను ధరించాడు. దీంతో మ్యాచ్ కొద్దిసేపు ఆగిపోగా, ఆ తర్వాత అతన్ని భద్రతా సిబ్బంది పిచ్ నుంచి బయటకు తీసుకెళ్లారు. ఆ తర్వాత పోలీసులకు అప్పగించినట్లు సమాచారం. అక్టోబరు 7న హమాస్ ఉగ్రవాదులు జరిపిన దాడికి ప్రతీకారంగా గాజాపై ఇజ్రాయెల్ వైమానిక, భూదాడులు చేస్తోంది. ఇజ్రాయెల్ - హమాస్ మధ్య జరుగుతున్న యుద్ధంలో పాలస్తీనియన్లపై ముఖ్యంగా పౌరులు ప్రాణాలు కోల్పోవడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ క్రమంలో అహ్మదాబాద్‌లో జరుగుతున్న మ్యాచ్ లో పిచ్‌పై దాడి చేసిన వ్యక్తి ఇంద్రధనస్సు జెండాను కూడా పట్టుకున్నాడు.




## హార్దిక్ పాండ్యా లోటు ఇప్పుడు తెలిసొచ్చింది

బ్యాటుతో, బంతితో ఎంతో ఉపయోగపడే హార్దిక్ పాండ్య జట్టుకు తెచ్చే విలువే వేరు. బ్యాటింగ్‌లో కష్టాల్లో పడితే ఆదుకుంటాడు. బౌలింగ్‌లో పూర్తి కోటా వేయగల సమర్థుడు. ప్రపంచకప్‌లో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ అతను బంతితో రాణించాడు. బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో అతను గాయపడి టోర్నీకి దూరమైనా భారత్ పెద్దగా కంగారు పడలేదు. హార్దిక్ లేని లోటును భర్తీ చేసే క్రమంలో శార్దూల్‌ను తప్పించి షమిని ఆడించడం గొప్పగా కలిసొచ్చింది. బ్యాటింగ్‌లో సూర్యకుమార్ మీద పెద్దగా ఆధారపడాల్సిన అవసరం లేకపోయింది. దీంతో హార్దిక్ లేని లోటు గురించి ఆలోచనే లేదు. కానీ ఫైనల్లో మాత్రం హార్దిక్ లేని లోటు స్పష్టంగా కనిపించింది.




## భారత్‌కు వస్తున్న నౌక హైజాక్

హౌతీ రెబల్స్ దుశ్చర్య

సిబ్బందిలో పలువురు విదేశీయులు

యెమెన్‌కు చెందిన హౌతీ రెబల్స్ తమకు సంబంధించిన ఓ నౌకను హైజాక్ చేశారని ఇజ్రాయెల్ ఆరోపించింది. కీలకమైన ఎర్ర సముద్రంలో ఆదివారం ఆ కార్గో నౌకను హైజాక్ చేశారని తెలిపింది. దీంతో ఇజ్రాయెల్, హమాస్ ఉద్రిక్తతలు మరింత పెరుగుతాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. నౌకను తామే అదుపులోకి తీసుకున్నామని హౌతీ రెబల్స్ ప్రకటించారు. బల్గేరియా, ఫిలిప్పీన్స్, మెక్సికో, ఉక్రెయిన్‌కు చెందిన 25 మంది సిబ్బందితో తుర్కియే నుంచి భారత్‌కు వస్తున్న ఈ కార్గో నౌకను హౌతీ రెబల్స్ హైజాక్ చేశారని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు కార్యాలయం ప్రకటించింది. అందులో ఇజ్రాయెలీలెవరూ లేరని వెల్లడించింది. భారతీయులూ లేరని ధ్రువీకరించింది. గెలాక్సీ లీడర్ అనే ఈ నౌకను హైజాక్ చేయడాన్ని ప్రధాని కార్యాలయం ఖండించింది. ఇరానియన్ తీవ్రవాద చర్యగా అభివర్ణించింది. అంతర్జాతీయ సంక్షోభానికి దారితీసే తీవ్ర చర్యగా పేర్కొంది. ఈ నౌక బ్రిటన్ కంపెనీ యాజమాన్యంలోనిదని, జపాన్ నిర్వహిస్తోందని అధికారులు తెలిపారు. రే కార్ క్యారియర్స్ అనే సంస్థ ఈ నౌక యజమానిగా పబ్లిక్ డొమైన్‌లో ఉంది. ఆ సంస్థ అబ్రహాం రామి ఉంగర్ అనే వ్యాపారిది. ఆయన ఇజ్రాయెల్‌లో అత్యంత సంపన్నుడు. నౌక హైజాక్‌పై ఆయనను సంప్రదించగా.. తనకు విషయం తెలిసిందని, వివరాలు అందకుండా స్పందించలేనని తెలిపారు.

నౌకను యెమెన్ తీరానికి రెబల్స్ తరలించినట్లు తెలుస్తోంది.




## రాజస్తాన్‌లో రోడ్డు ప్రమాదం... ఆరుగురు పోలీసుల దుర్మరణం

రాజస్తాన్‌లో చురు జిల్లాలో ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన నేపథ్యంలో భద్రతా విధుల నిమిత్తం వెళ్తున్న ఆరుగురు పోలీసు సిబ్బంది ఈ ఘటనలో దుర్మరణం పాలయ్యారు. వారంతా నగౌర్ నుంచి ఎన్నికల ర్యాలీ జరగనున్న ఝుంఝును వెళ్తుండగా తెల్లవారుజామున ప్రమాదం జరిగింది. వారు ప్రయాణిస్తున్న కారు దట్టమైన పొగ మంచు కారణంగా ఎదురుగా వస్తున్న ట్రక్కును ఢీకొంది. దాంతో ఐదుగురు అక్కడికక్కడే మరణించారు. మరొకరు ఆస్పత్రిలో కన్నుమూశారు. తీవ్రంగా గాయపడ్డ మరొకరి పరిస్థితి విషమంగా ఉంది.





## సూర్యాపేటలో కలకలం.. BSP అభ్యర్థిపై గొడ్డలితో దాడికి యత్నం..

తెలంగాణలో రాజకీయ హింస పెరుగుతోందా? ప్రశాంత వాతావరణం కాస్తా.. ప్రమాదకరంగా మారుతోందా? సూర్యాపేట జిల్లాలో జరిగిన ఘటన షాకిస్తోంది. అక్కడి ఆత్మకూరు(ఎస్) మండలం లోని గట్టికల్లు గ్రామంలో BSP, BRS కార్యకర్తలు కొట్టేసుకున్నారు. ఆదివారం రాత్రి BSP తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న వట్టే జానయ్యపై హత్యాయత్నం జరిగింది. జానయ్య ఎన్నికల ప్రచారం చేస్తుండగా మరో పార్టీకి చెందిన ఓ నేత ఆయనపై గొడ్డలితో దాడికి యత్నించాడు. ఒక్కసారిగా పరిస్థితి మారిపోయింది. తీవ్ర కలకలం రేగింది. ఈ దాడిని గమనించిన BSP కార్యకర్తలు.. జానయ్యకు అండగా నిలిచారు. దాంతో వారిపై దాడి జరగగా.. వారు గాయపడ్డారు. ఆ తర్వాత స్థానికులు వారిని ఆస్పత్రికి తరలించారు. వారిలో ఒకరికి తీవ్ర గాయాలైనట్లు తెలిసింది. ఈ దాడిలో జానయ్య తప్పించుకున్నారు గానీ.. ఆయన అనుచరులు గాయపడ్డారు. ఏకంగా గొడ్డలితో దాడి చెయ్యడంతో.. అక్కడున్నవారంతా షాకయ్యారు. తెలంగాణలో ఇలాంటి దాడులేంటని అంతా ముక్కున వేలేసుకున్నారు. BRS పార్టీ ఎమ్మెల్యే, మంత్రి జగదీశ్ రెడ్డి అనుచరులు, బంధువులే ఈ దాడి చేశారని బీఎస్పీ ఆరోపించింది. ఇందుకు బాధ్యులైన వారిని అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసింది. పోలీసులు కేసు రాసి.. కొంతమందిని అరెస్ట్ చేశారు. తెలంగాణలో ప్రధాన పోటీ బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్యే అని చాలా మంది అంటున్నారు. బీఎస్పీ పోటీ చేస్తున్నా ఆ పార్టీ ప్రభావం పెద్దగా ఉండదు అంటున్నారు. మరి అలాంటప్పుడు ఆ పార్టీ నేతపై గొడ్డలితో దాడి చేసి, ఏకంగా చంపేయాలనేంత దారుణమైన కుట్రలు ఎందుకు? రాజకీయ నేతలకు ఆవేశం పనికిరాదు. ఇలాంటి దాడులను ఎవరూ హర్షించరని స్థానికులు చెబుతున్నారు.

## వరల్డ్‌కప్ ఫైనల్‌పై భారీగా బెట్టింగ్.. చేతులు మారిన రూ.కోట్లు



ఎన్నికల విధుల్లో పూర్తిగా తలమునకలైన పోలీసులు.. ఇంకోవైపు ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్.. దీనికితోడు వారాంతం.. ఇంకేముంది బెట్టింగ్ బాబుల గల్లా పెట్టె నిండింది. భారత్- ఆస్ట్రేలియా ఫైనల్ మ్యాచ్ బెట్టింగ్ నిర్వాహకులు.. పంటర్లకు కాసులు కురిపించింది. ఆదివారం ఒక్క రోజే రూ.కోట్లు చేతులు మారాయి. వికెట్ వికెట్‌కు.. బంతి బంతికీ పందెం కాస్తూ రెండు చేతులా సంపాదించారు. 2011 తర్వాత భారత్ మరోసారి ఫైనల్‌కు చేరడంతో ఈసారి బెట్టింగ్ మరింత పెరిగింది. ఫాంహౌస్‌లు, రిసార్టులు వేదికగా: ప్రపంచకప్ ఫైనల్ నేపథ్యంలో బెట్టింగ్ నిర్వాహకులు ముందే అంతా సిద్ధం చేసుకున్నారు. ఎక్కువ మంది ఫాంహౌస్‌లు వేదికగా చేసుకుని మంత్రాంగం నడిపించారు. వారాంతం కావడంతో శనివారం సాయంత్రమే నగర శివార్లలోని ఫాంహౌస్‌లకు చేరుకుని వ్యవహారం నడిపించారు. సాధారణ సమయాలతో పోలిస్తే ఈ శని, ఆదివారాల్లో శామీర్‌పేట, మొయినాబాద్, శంషాబాద్, ఇబ్రహీంపట్నం, రాజేంద్రనగర్ సహా నగర శివారులోని ప్రాంతాల్లోని ఫాంహౌస్‌లు ఎక్కువగా బుకింగ్ చేసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కొందరు నిర్వాహకులు పంటర్లను ఆకట్టుకునేందుకు మందు, చిందు ఏర్పాటు చేశారు. ఫామ్‌హౌస్‌లు, రిసార్టుల్లో పెద్ద తెరలు ఏర్పాటు చేసి.. ఆఫ్‌లైన్‌లో బెట్టింగ్ నిర్వహించారు.